పోషకాల సమాహారం 'గోరుముద్ద'



తోటగరువు హైస్కూల్‌లో చెక్కీలు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ, ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

ఆరిలోవ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గోరుముద్ద పథకం కింద పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్టు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు తెలిపారు. డీఈవో చంద్రకళతో కలిసి మంగళవారం ఆయన తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడ మధ్యాహ్నం పిల్లల కోసం వండిన భోజనాలు, రోజూ పిల్లలకు అందించే చెక్కీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ రుచికరంగా వంటలు తయారు చేయించాలని హెచ్‌ఎం దుర్గాభవానికి సూచించారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పోషకాలు కలిగిన పోర్టుఫైడ్ బియ్యం పాఠశాలలకు పంపిణీ చేస్తుందన్నారు. గుడ్లు చిన్నవిగా ఉంటే సరఫరా చేసిన డీలర్‌కు వెంటనే తిరిగి పంపించేయాలన్నారు. ఆహారం తయారు చేయడంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భనలో ఎంఈవో పైడిపునాయుడు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

ఏయూ క్యాంపస్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. మంగళవారం ఉదయం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఈస్ట్‌పాయింట్ కాలనీ లోని కేడీపీఎం హైస్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. భోజనాన్ని స్వయంగా రుచిచూశారు. అనంతరం ఎంవీపీ కాలనీ సెక్టార్-9 లోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి, హాజరు పట్టికను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడవివరం జిల్లా పరిషత్ హై స్కూల్ తనిఖీ చేసి అక్కడ విద్యార్థులతో మాట్లాడా రు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాష్‌రావు, డీఈవో చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

ఏయూ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

- అవసరమైన మరమ్మతులకు వీసీ ప్రసాదరెడ్డి ఆదేశం
- ఫార్మసీ హాస్టల్ నిర్వహణపై ప్రశంసలు



ఫార్మసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ హాస్టల్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు పలు మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావుకు సూచించారు. వర్సిటీలో హాస్టళ్లను విభజించి, పర్యవేక్షణ బాధ్యతలు యూనివర్సిటీ ఇంజినీర్లకు అప్పగించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో కాలానుగుణంగా అవసరమైన మరమ్మతులు గుర్తించి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దీని వల్ల విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన చేయడంతో పాటు భవనాలను దీర్ఘకాలం పరిరక్షించడం సాధ్యపడుతుందన్నారు.

అనంతరం ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌ను కూడా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై ఆరా తీశారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహిస్తున్న విధానంపై ప్రశంసించారు. విద్యార్థినులకు ఉపయుక్తంగా మరిన్ని వసతుల కల్పన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.కె.ఎం.పవార్, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, ఇంజినీరింగ్, హాస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు సంక్రాంతి కానుకలు



దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దివ్యాంగులకు వైష్ణవి దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. తోటగరువు ప్రాంతం ఎర్నిదుర్గమాంబ గుడి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బియ్యం, పప్పులు, నూనెతో పాటు కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నారాయణాచార్యులు, లక్ష్మీనారాయణ, దివ్యాంగుల సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో కృష్ణా కళాశాల సత్తా



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా కళాశాల జట్టు సభ్యులు

మద్దిలపాలెం: ఏయూ అంతర కళాశాలల మహిళా నెట్‌బాల్ టోర్నమెంట్‌లో డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఈ పోటీలు ఈ నెల 9వ తేదీ నుంచి ఏవీఎన్ కళాశాలలో జరిగాయి. సత్తా చాటిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల క్రీడా విభాగాధిపతి డాక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

మద్దిలపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్-3 స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు బుధవారం వేలం వేయనున్నామని సర్కిల్-3 ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలోని స్టేషన్‌లో సాయంత్రం 4 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఉదయం స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

విశ్రాంత ఆచార్యుడు వెంకటేశ్వర్లు మృతి



ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు కె.వెంకటేశ్వర్లు(88) మంగళవారం మృతి చెందారు. రాజమండ్రిలో తన కుమారుడి నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1979-82 సంవత్సరాలలో విభాగాధిపతిగా పనిచేశారు. అనంతరం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా సేవలు అందించారు. వెంకటేశ్వర్లకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి విభాగ విశ్రాంత ఆచార్యులు కె.రవి, ఆచార్య మధుసూదనరావు, డాక్టర్ మీనారావు, డాక్టర్ నళిని, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ పి.ప్రేమానందం డాక్టర్ హరి తదితరులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

1న విష్ణు సహస్ర నామ స్తోత్రంపై పోటీలు

ఎంవీపీ కాలనీ: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విష్ణు సహస్ర నామ స్తోత్రం, అచ్యుతాష్టకం శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం హిందూ ధర్మప్రచార పరిషత్ ఓ ప్రకటన విడుదల చేసింది. వచ్చేనెల 1న ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ-కౌంటర్ సముదాయంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో ఈ పోటీలు జరగనున్నాయి. 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు విష్ణు సహస్రనామ స్తోత్రముపై, 10 సంవత్సరాల లోపు విద్యార్థులకు అచ్యుతాష్టకం శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: విద్యా రంగంలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు నేడు కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. మంగళవారం జీవీఎంసీ 22వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కరమాని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో టోకరా

అల్లిపురం : పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ వ్యక్తి నుంచి రూ.5.42 లక్షలకు టోకరా వేశారు. విశాలాక్షినగర్‌కు చెందిన ఒక వ్యక్తికి 7066147726 వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తాను బజాజ్ ఫైనాన్స్ రిసెప్షనిస్ట్‌గా పరిచయం చేసుకుని, ఇంటి వద్ద నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకుని డబ్బు సంపాదించుకోవచ్చని తెలిపింది. తాను చేయనని బాధితుడు చెప్పినప్పటికీ అతడిని నమ్మించడం కోసం రూ.100 అకౌంట్‌లో జమ చేసింది. దీంతో అది నిజమని నమ్మిన అతను చాటింగ్ చేయడం మొదలుపెట్టాడు. తర్వాత బాధితుడికి సుమారు రూ.400 అకౌంట్‌లో జమ అయింది. తరువాత రూ.54,000 పెట్టి ఐటెమ్స్ కొనాలని అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పింది. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.5.42 లక్షలు చెల్లించాడు. నగదు విత్ డ్రా చేసుకోవాలంటే మరి కొంత మొత్తం డిపాజిట్ చేయాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ కె.భవానిప్రసాద్ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పార్ట్ టైం జాబ్ మెసేజ్‌లను నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. అలా వచ్చినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా సైబర్ క్రైం నంబర్ 9490617917కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆదర్శనగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం పోలీసులు

ఆరిలోవ: తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనాలు జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ద్వారకా సీఐ రమణమూర్తి సూచించారు. జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో మంగళవారం క్రైం బ్రాంచి పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బయట క్యాంపులకు వెళ్లే ఇంట్లో విలువైన వస్తువులు ఉంచొద్దన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవడం మంచిదన్నారు. పిల్లలకు బంగారు ఆభరణాలు వేసి ఒంటరిగా బయటకు పంపించవద్దన్నారు. ప్రయాణం చేసేటప్పుడు విలువైన వస్తువులు ఉంచే బ్యాగులు మీ వద్దే జాగ్రతగా పెట్టుకోవాలన్నారు. మహిళలు ఆభరణాలు ధరించి నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లొద్దని సూచించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు చెప్పకూడదన్నారు. ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 100, 1090కు డయల్ చేయాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటార్ సైకిళ్లకు ఫోర్క్ లాక్ వేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ఆరిలోవ క్రైం బ్రాంచి ఎస్ఐ రుక్మంగదరావు సెల్ ఫోన్ 83310 41604కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న విజయరవీంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ సంబరాలను కరస్పాండెంట్ విజయరవీంద్ర ప్రారంభించారు. అనంతరం హరిదాసు, గంగిరెద్దు ప్రదర్శనలు సాగాయి. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు హాజరై రంగవల్లుల ప్రదర్శన, పతంగులను ఎగరవేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఐఐఏఎంలో..

ఎంవీపీ కాలనీలో ఐఐఏఎంలో సంప్రదాయ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉన్నతాధికారులతో పాటు విద్యార్థులు పాల్గొని ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ఐఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురు పూజోత్సవాలు



పరమ గురువులు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఈకే) స్థాపించిన జగద్గురు పీఠం ఆధ్వర్యంలో 62వ గురు పూజోత్సవాలను ఈ నెల 11, 12, 13 తేదీలలో మహారాణిపేటలోని అంకోసా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు పరమ గురువులు, దేవతా మూర్తులతో గురు ప్రార్థనలు, రుద్రాభిషేకం, నారాయణ హోమం, లలితా సహస్ర నామ పూజ చేయనున్నామన్నారు. దేశ, విదేశాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1500 మంది సాధకులు ఈ వేడుకలకు హాజరు కానున్నారన్నారు. అలాగే 1972లో మాస్టర్ ఈకే నెలకొల్పిన ×నా వాణి×దర్శన మాసపత్రిక స్వర్ణోత్సవాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు.

20 నుంచి విద్యార్థి యువజన సమరయాత్ర

దాబాగార్డెన్స్: ప్రత్యేక హోదా, ఆంధ్రప్రదేశ్ హక్కులు, విభజన హామీల కోసం ఈ నెల 20 నుంచి విద్యార్థి యువజన సమరయాత్ర 2.0 నిర్వహించనున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఫణీంద్ర, బుల్లిరాజు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, డివైఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఈ యాత్ర ఈ నెల 20న హిందూపూర్‌లో ప్రారంభమై ఫిబ్రవరి 4న ఇచ్ఛాపురంతో ముగియనుందని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నమ్మక ద్రోహం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయమై స్పందించాలన్నారు. న్యాయమైన హక్కుల సాధనకు పార్టీలకు అతీతంగా సహకరించి, విద్యార్థి యువజన సమరయాత్ర విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏజే స్టాలిన్, ప్రొఫెసర్ అప్పలనాయుడు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

22 నుంచి రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య గురువరేణ్య కుమార స్వామిజీ

సీతంపేట: మాఘ మాసం సందర్భంగా రాజశ్యామల మాత నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఎంవీపీ కాలనీ సెక్టార్-11లో నిర్వహించనున్నామని మాతా శారదా ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య గురువరేణ్య కుమార స్వామిజీ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం పెదపూడి ప్రశాంత్‌కుమార్, మంచా మల్లేశ్వరి, శంకర్ దేవర, మును పల్లతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాల మాదిరిగానే రాజశ్యామల మాత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. నిత్యం అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ ఉత్సవాలకు లక్ష మంది వరకు భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఏయూ వేదికగా అంతర్జాతీయ తెలుగు భాషోత్సవాలు

- ఫిబ్రవరి 21, 22 తేదీలలో నిర్వహణ
- అధికారులతో వీసీ సమీక్ష



మూర్తి రేమెళ్లను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా తెలుగు విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల 21, 22 తేదీలలో అంతర్జాతీయ తెలుగు భాషోత్సవాలు జరగనున్నాయి. తెలుగు విభాగ ఆచార్యులతో పాటు వివిధ తెలుగు భాషా, సాహితీ సంస్థ ప్రతినిధులతో వర్సిటీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం తెలుగు విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య ఎ.సీ తారత్నం మాట్లాడుతూ ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు, పరిశోధన సదస్సులు జరుగుతాయన్నారు. తెలుగు విభాగం ఆచార్యుడు జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు, పరిశోధకులతో పాటు తల్లిదండ్రులు తెలుగు భాషని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ తెలుగు భాషను అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, సమైక్య భారతి జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మూర్తి రేమళ్ళ, జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, ముఖ్య సలహాదారు ఎస్.విజయగోపాల్, డాక్టర్ డి.వి.సూర్యారావు, గిడుగు నాగేశ్వరరావు, అమెరికా నుంచి నాటా ప్రతినిధి సుధారాణి గాపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూర్తి రేమెళ్లను వీసీ సత్కరించారు.

జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఏయూ వలంటీర్లు



ఎంపికైన వలంటీర్లతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికయ్యారు. భారత యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు కర్ణాటకలోని హుబ్లీలో జరగనున్న ఈ ఉత్సవాలకు ఏయూ ఎన్ఎస్ఎస్‌కు చెందిన 8 మంది వలంటీర్లు, ప్రోగ్రాం అధికారి హాజరు కానున్నారు. దేశ వ్యాప్తంగా 1000 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర సంస్కృతిని, విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపచేసే విధంగా కృషి చేయాలని సూచించారు. యువతలో దేశభక్తి, ఐక్యత పెంపొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చిన అప్పన్న



కాళీయ మర్దనుడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాళీయమర్దనుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు



క్షతగాత్రుడికి 108 వాహనంలో ప్రథమ చికిత్స చేయిస్తున్న పోలీసులు

ఆరిలోవ: మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని ఆరిలోవ పోలీసులు సూచించారు. సోమవారం రాత్రి ఓ వ్యక్తి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై నగరం నుంచి మధురవాడ వైపు వెళ్తున్నాడు. జూ పార్కు సమీపంలో డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటనలో అతనికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు అక్కడికి చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స చేశారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ ఆదేశించారన్నారు.

కొలువుదీరిన వనితా వాకర్స్ కార్యవర్గం

మురళీనగర్: స్థానిక వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం కొలువుదీరింది. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్పీ రవీంద్ర సమక్షంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నరు ఉప్పలపాటి శుభ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవీంద్ర మాట్లాడుతూ వనితా వాకర్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నూతన కార్యవర్గం సభ్యులు సమన్వయంగా పనిచేసి వాకర్స్ క్లబ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా అధ్యక్షుడు డీడీ నాయుడు, సెక్రటరీ జనరల్ శీలం ఐజాక్, అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, రీజనల్ కౌన్సిలర్ ఎ.లక్ష్మీరెడ్డి, డిస్ట్రిక్ట్ ఎలక్ట్ గవర్నర్ (2024) టి.రంగారావు, వనితా వాకర్స్ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, ఉపాధ్యక్షురాలు కె.వినీల, కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారం షీలా, ప్రోగ్రాం ఇన్‌చార్జి శిరీష లత పాల్గొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు ప్రారంభం



గంగధార వద్ద గోదాదేవికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఆలయం నుంచి తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి గంగధార జలాలతో అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని వేంచేయజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారిని పలకిలో ఆలయంలోకి తీసుకెళ్లి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.